RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

వరంగల్
సంపుటి : 3, సంచిక : 199

శుక్రవారం
జులై 04, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00

దినపత్రిక



**భారత్‌లో ఐఫోన్ తయారీకి చైనా బ్రేక్?**

3లో..



## అధైర్య పడకు అక్కా..
# నేనున్నా

- నీ బిడ్డ ఆరోగ్య బాధ్యత నాది
- హామీ ఇచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**వేద న్యూస్, ఖమ్మం :**

మంచం మీద అచేతన స్థితిలో ఉన్న పరశురాం కూతురు సింధు ఆరోగ్య పరిస్థితి గురించి సింధు తల్లి లలితను అడిగి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలుసుకున్నారు. కూసుమంచి మండల పర్యటనలో భాగంగా ధర్మతండాలో ఇటీవల మృతి చెందిన పరశురాం కుటుంబాన్ని పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పరశురాం కుమార్తె ఆరోగ్య పరిస్థితిని అతని భార్య లలితను అడిగి తెలుసుకున్నారు. మంత్రి ముందు లలిత కన్నీటి పర్యాంతమై తన బాధను చెప్పుకున్నారు. వెంటనే మంత్రి పొంగులేటి స్పందించి ఎంపీ రఘురాం రెడ్డి, తాను కలిసి స్వయంగా హైదరాబాద్ హాస్పిటల్ కి వచ్చి డాక్టర్ల తో మాట్లాడి వైద్యం చేపిస్తామని హామీ ఇచ్చారు. అంతేగాక ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న సీఎం రిలీఫ్ పండ్ బిల్లులన్ని మంజూరు చేపిస్తానని హామీ ఇచ్చారు. అధైర్య పడకు అక్కా నేను అండగా ఉంటానని చూసుకుంటనని హామీ ఇచ్చారు.

## హాస్టల్ సీటు
# ఇప్పించరూ!

- బాగా చదవాలనుంది: విద్యార్థిని వేడుకోలు
- చిన్ననాటే రెండు కాళ్లు వంకర.. చదువు పట్ల మక్కువ
- కుంటుతూనే 4 కి.మీ. నడిచి స్కూల్‌కు వెళ్తున్న సబ్జాన్
- ఒక్కరోజు కూడా డుమ్మా కొట్టకుండా పాఠశాలకు..

**వేద న్యూస్, కమలాపూర్:**

విద్యతో పేదరికాన్ని జయించొచ్చనేది అక్షర సత్యం. ప్రస్తుత సమాజంలో ప్రతిఒక్క తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పట్ల ఎంతో జాగరుకతతో వ్యవహరిస్తున్నారు. చక్కటి పాఠశాలకు పంపించేందుకు ఎన్ని కష్టాలైనా పడుతున్నారు. ప్రతిరోజూ ఉదయం పూట స్కూల్ డ్రెస్, టిఫిన్ బాక్స్ సర్దడమే కాకుండా బస్సెక్కించి.. స్కూల్‌కు సాగనంపుతున్నారు. అయితే, ఆర్థికంగా ఆ మేరకు స్తోమత లేని వారి సంగతేంటి..? వారి కష్టాలు వర్ణనాతీతమే. అందులో సదరు విద్యార్థినికి అంగవైకల్య సమస్యలుంటే ఇక ఆ బాధలు చెప్పలేం. ఈ కోవకు చెందిన ఓ విద్యార్థియే.. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిధిలోని కాసింపల్లికి చెందిన ఓ నిరుపేద విద్యార్థిని సయ్యద్ సబ్జాన్ బి. బాలిక తల్లిదండ్రులు అంగురా బి, హుస్సేన్. ప్రతి రోజూ స్కూల్‌కు వెళ్లేందుకు సబ్జాన్ పడే కష్టం చూస్తే కంటతడి పెట్టని వారుండబోరు అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. చిన్ననాటి నుంచి చదువు పట్ల ఆసక్తి కలిగిన సబ్జాన్ బి.. తన రెండు కాళ్లు వెనుకకు మెలి తిరిగి ఉన్నా.. ఇబ్బందులు పడుతూనే స్కూల్‌కు నడిచి వెళ్తోంది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు కమలాపూర్ మండల కేంద్రంలోని ఐవోసీ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ప్రైమరీ స్కూల్‌లో చదివిన ఆమె.. ప్రస్తుతం ఆరో తరగతి చదవడం కోసం బాలికల జెడ్పీహెచ్ఎస్‌లో చేరింది. స్కూల్‌కు వెళ్లేందుకు.. కాసింపల్లిలోని తన ఇంటి నుంచి ఆమె ఉదయం దాదాపు 2 కి.మీ., తిరుగు ప్రయాణంలో 2 కి.మీ. మొత్తం సుమారు 4 కి.మీ. ప్రతిరోజూ అవస్థలు పడుతూ.. నరకయాతన అనుభవిస్తూ.. కుంటుతూ నడుస్తోంది. చదువు పట్ల పరితపనతో ముందుకెళ్తున్న సదరు విద్యార్థినికి హాస్టల్ సీటు ఇప్పిస్తే.. ఆమె కష్టాలు తీరుతాయని.. మానవతా దృక్పథంతో సీటు కేటాయించాలని విద్యార్థిని పేరెంట్స్ కోరుతున్నారు. తనకు హాస్టల్ సీటు ఇస్తే.. తాను బాగా చదువుకుంటానని విద్యార్థిని సబ్జాన్ పేర్కొంటున్నారు.



# మార్కెట్ పై నిర్లక్ష్యం ఎందుకు..?



**వేద న్యూస్, కాజీపేట :**

కాజీపేట వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్ విషయం లో కమిషనర్ మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మాజీ కార్పొరేటర్ బిజెపి సీనియర్ నాయకులు నార్లగిరి రామలింగం అన్నారు. గురువారం కాజీపేట వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ అనేకసార్లు కాజిపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కి వినతి పత్రాలు అందజేస్తూనే ఉన్నాము. కానీ అధికారులు అ పత్రాలను చూసి చూడనట్టుగా ముఖం చాటేస్తున్నారు. దీనివల్ల రోడ్ల పైన చిరు వ్యాపారులు కూరగాయలు అమ్మడంతో మార్కెట్లోకి ఎవరూ రావడం లేదని మార్కెట్లోని వ్యాపారులకు వ్యాపారం జరగడం కష్టంగా ఉందనీ, దీనిని వీలైనంతవరకు ఈ రెండు, మూడు రోజుల్లో పరిష్కరించాలని, లేనియెడల వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్ వ్యాపారులచే కాజీపేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నామన్నారు. చేతకాకపోతే కమిషనర్ తక్షణమే రీజన్ చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు చాంద్ పాషా, మార్కెట్ అధ్యక్షులు నిషాని బిక్షపతి, ఏసు, కలమ్మ ,కొమరమ్మ ,స్వరూప, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడులకు రక్షణ..
# పరిశ్రమలకు సహకారం

**- సీఎం రేవంత్ రెడ్డి**



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

తెలంగాణలో పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందడానికి ఆయా పరిశ్రమలకు అవసరమైన ప్రోత్సాహకాలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు రక్షణ కల్పించడమే కాకుండా లాభదాయకంగా ఉండేందుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని పారిశ్రామిక వేత్తలను ఉద్దేశించి చెప్పారు. మహేశ్వరం జనరల్ పార్క్‌లో మలబార్ గ్రూపు స్థాపించిన జెమ్స్ అండ్ జ్యువెల్లరీ యూనిట్‌ను గురువారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారిశ్రామిక రంగం అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరిస్తామని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు.

తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించడం, రంగాల వారిగా పరిశ్రమలు రాణించడానికి సహకరించడంలో ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. పారిశ్రామిక రంగం అభివృద్ధికి తెలంగాణలో గత ప్రభుత్వాల నుంచే సానుకూల

మిగతా 3వ పేజీలో..

# మహిళా ప్రిన్సిపాల్ ను నియమించాలి




**- గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు**

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ కమిటీ ఆధ్వ ర్యంలో డీఏవో కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి భారత విద్యార్థి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు కుర్ర సైదా నాయక్ మాట్లాడుతూ మిర్యాల గూడ నియోజకవర్గంలో మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల లో మహిళ ప్రిన్సిపాల్ ని ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా విద్యార్థి నిలు ఆశ్రమ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు కావున మహిళా ప్రిన్సిపాల్ ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థినిలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యను అభ్యసించడానికి అవకాశం ఉంటుందన్నారు. గర్ల్స్ ఆశ్రమ పాఠశాలకు మహిళా ఉపాధ్యాయుల నియమించడమే ఉత్తమమన్నారు. అదేవిధంగా ఆశ్రమ పాఠశాలలో ఉన్న గుట్టను తొలగించాలని సూచించారు. గుట్టను తొలగించడం వల్ల విద్యార్థినులకు ఆడుకోవడానికి ప్లే గ్రౌండ్ ఏర్పాటు అయితదని,తద్వారా విద్యార్థులు శారీరక దృఢత్వాన్ని పొందగలుగు తారన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు జగన్ నాయక్,ఎస్ఎఫ్ఐ టౌన్ ఉపాధ్యక్షుడు అనిల్, అఖిల్,బన్నీ, మణి, తరుణ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



# ఏ తప్పు చేయలే..!

- నా శాఖలకు న్యాయం చేస్తున్నాను : మంత్రి సురేఖ
- బీసీల కోసం పోరాడుతా : మాజీ ఎమ్మెల్సీ మురళీ
- సుష్మితకి రాజకీయ నిర్ణయాలు తీసుకునే హక్కు ఉంది : కొండా దంపతులు

3లో..



## వెరిఫికేషన్ పకడ్బందీగా
# నిర్వహించాలి

**- కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

రేషన్ కార్డ్ ల వెరిఫికేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్లో రేషన్ కార్డ్ వెరిఫికేషన్ అధికారులు, ఆర్ఐలు, ఆర్ఓలతో రేషన్ కార్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ పురోగతిని కమిషనర్ సమీక్షించారు. ఈ

మిగతా 2వ పేజీలో..

# నూతన ఎస్సై బాధ్యతల స్వీకరణ

## – ఇల్లందకుంట సబ్ ఇన్ స్పెక్టర్ గా క్రాంతి



**వేద న్యూస్, ఇల్లందకుంట:**

ఇల్లందకుంట మండల నూతన ఎస్సైగా ఎం. క్రాంతి కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ..మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, మత్తు పదార్థాలు ,జూదం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామనీ చెప్పారు రాబోకాలంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో ప్రజలు సోదర భావంతో మెదలాలని విజ్ఞప్తి చేశారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, అత్యవసర సమయంలో 100 కి ఫోన్ చేయాలని సూచించారు. ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్ వచ్చి ఫిర్యాదు చేయవచ్చునీ స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసువారికి ప్రజలు సహకరించాలని కోరారు.

# పత్తి క్వింటాల్ కు గరిష్ట ధర రూ.7,500

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కు కాటన్ విడి పత్తి పది క్వింటాళ్లు ఒక వాహనంలో గురువారం రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. గరిష్ట ధర రూ.7,500, మోడల్ ధర రూ.7,500, కనిష్ట ధర రూ.7,500 పలికిందని మార్కెట్ సెక్రటరీ ఆర్ మల్లేశం ఓ ప్రకటనలో తెలిపారు.

# కాంగ్రెస్ నేతకు ఆర్థిక సహాయం



**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :**

కాంగ్రెస్ నేత కట్టెకోల శ్రీమన్నారాయణ బ్రెయిన్ స్ట్రోక్ తో ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత%శీ% ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానిక నేతల ద్వారా విషయం తెలుసుకున్న ఆయన గురువారం ఉదయం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శ్రీమన్నారాయణను పరామర్శించారు. అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు 1 లక్ష 50000 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

**వేద న్యూస్, జమ్మికుంట:**




– డిప్యూటీ డిఎంహెచ్ఓ చందు

వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గంద్రపల్లి గ్రామంలో గల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో డిప్యూటీ డి ఎం హెచ్ వో డాక్టర్ చందు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో దగ్గు, జలుబు వంటి చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఉన్న 21 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ.. వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, రక్త హీనత వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల గురించి, సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్య, మెదడువాపు, టైఫాయిడు, జాండిస్ మొదలగు వ్యాధులు వ్యాపించు విధానం, వ్యాధుల లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి క్లుప్తంగా బాలికలకు వివరించారు. చేతుల పరిశుభ్రత గురించి, హ్యాండ్ వాష్ చేసే పద్ధతులు గురించి చెప్పినారు. ఆకుకూరలు, పాలు, పండ్లు, గ్రుడ్లు తీసుకున్నట్లయితే రక్త హీనత రాకుండా ఉంటుందనీ వెల్లడించారు. ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే గవర్నమెంట్ హాస్పిటల్ కి వచ్చి పరీక్షలు చేహించుకోవాలని బాలికలకు సూచించారు. అలాగే వసతి గృహంలోని వంటగదిని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని,పాఠశాల ప్రాంగణంలో నీరు నిల్వ ఉండకుండా,పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఝాన్సీ,హెల్త్ ఎడ్యుకేటర్స్ పంజాల ప్రతాప్ గౌడ్,మోహన్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఇందిరా, సూపర్ వైజర్ కుసుమ కుమారి, పంచాయతీ సెక్రెటరీ రాము,ఏఎన్ఎం మనీ,ఆశా కార్యకర్తలు సంపూర్ణ,దీపిక, పుష్పలత, ఉపాధ్యాయురాళ్లు,విద్యాలయ బాలికలు పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ షాప్ అకస్మిక తనిఖీ

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలం నేరేడుపల్లి గ్రామంలో మురళీకృష్ణ ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపును మండల వ్యవసాయ అధికారి గంగ జమున, శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ వారి సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. వివిధ రకాల కంపెనీలకు చెందిన బయో మందులను వారు గుర్తించడం జరిగింది. ఇట్టి బయోమందులకు ఎటువంటి అనుమతి లేదు పైగా అనుమతి పొందిన స్థలంలో పొరపాటున కూడా వీటిని నిలువ చేయరాదు అమ్మరాదు వారు అని తెలిపారు.ఇటువంటి నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను అధికారులు వీటిని సీజ్ చేశారు .వీటి యొక్క విలువ రూపాయలు 19,410రూపాయలు గా గుర్తించడం జరిగింది. రైతులకు మండల వ్యవసాయ అధికారి ముఖ్య గమనిక బయోమందుల వల్ల పంటలు నష్టపోయే అవకాశం ఉంది. ఈ విషయమై రైతులకు ఎన్నో మార్లు అవగాహన సదస్సులు కూడా నిర్వహించామన్నారు. డీలర్లకు కూడా అనేకమార్లు హెచ్చరికలు జారీ చేసామన్నారు.కాబట్టి రైతులు పొరపాటున కూడా బయో మందులు వాడరాదు, డీలర్లు కూడా ఇకమీదట అమ్మటానికి కూడా వీలులేదని మండల వ్యవసాయ అధికారి తగు సూచనలు చేశారు.




# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణి

**వేద న్యూస్, బోయినిపల్లి :**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం తడగొండ గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు డా. మేడిపల్లి సత్యం, ఆదేశాలతో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను, కట్ట మల్లవ్వ, (36000),మొయినొద్దీన్, (15000)రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పదోన్నతి పై బదిలీ అయిన అనురాధకి సన్మానం



**వేద న్యూస్, చొప్పదండి :**

చొప్పదండి మండలం రుక్మాపూర్ సైనిక్ వెల్ఫేర్ ఆఫీసులో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ అనురాధ పదోన్నతి పై బదిలీ అయి వెళ్తున్న సందర్భంగా మాజీ సైనికులు, సర్వీస్ సైనికులు, జయహో జనతా ఫౌండేషన్ తరుపున ఘనంగా సన్మానం చేశారు.

## వెరిఫికేషన్ పకడ్బందీగా నిర్వహించాలి

సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బల్దియా పరిధి లో వరంగల్ జిల్లాకు సంబంధించి కొత్త రేషన్ కార్డుల కోసం 12,200 దరఖాస్తులు, హనుమకొండ జిల్లా కు సంబంధించి 16,700 కొత్త రేషన్ కార్డు ల కోసం దరఖాస్తులు రావడం జరిగిందన్నారు. వరంగల్ జిల్లా పరిధిలో ఇప్పటికే 50శాతం వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి అయిందని, మిగతా దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియను ఈనెల 10 లోగా పూర్తి చేయాలని సూచించారు. ఇందుకోసం వెరిఫికేషన్ అధికారులు ఉదయం నుండి క్షేత్రస్థాయిలో పని చేయాలని వీటితో సమాంతరంగా ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ ఇవ్వడంతో పాటు రెగ్యులర్ విధులను కూడా నిర్వహించాలని అన్నారు. ఆర్ఓలు, ఆర్ఐలు నిరంతరం ఇట్టి ప్రక్రియను పర్యవేక్షించాలని ఏవైనా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే డిఎస్డిఓ సాంకేతిక సిబ్బంది సహకారంతో సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కిష్టయ్య, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, ప్రసన్న రాణి, ఆర్ఓలు యూసుఫొద్దిన్, షహజాది బేగం, టిఎంసి రమేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్ లు తదితరులు పాల్గొన్నారు.

# తైక్వాండో పోటీల్లో చొప్పదండి విద్యార్థులకు బంగారు పతకాలు



**వేద న్యూస్, చొప్పదండి :**

ఉత్తరాఖండ్ హరిద్వార్ లో జరిగిన నేషనల్ తైక్వాండో పోటీలలో చొప్పదండి విద్యార్థులు తమ సత్తా చాటి బంగారు పతకాలు సాధించారు. పట్టణానికి చెందిన భూసారపు వెంకటేష్ మూడు గోల్డ్ మెడల్స్, ఆర్నకొండ గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఒకటి చొప్పున గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం వీరిని అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, చొప్పదండి పట్టణ మాజీ అధ్యక్షులు ముద్దం తిరుపతి గౌడ్, ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, ఆర్నకొండ మాజీ సర్పంచ్ విద్యాసాగర్ రెడ్డి, చత్రపతి శ్రీనివాస్ మరియు కోచ్ శ్రీ గాద సంతోష్, రమ్య, భూసారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.



## విద్యార్థులకు దుస్తువులు

# అందజేత

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

త్రిపురారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులందరికీ ఉపాధ్యాయులు అందించిన ఆర్థిక సహాయంతో బూట్లు, సాక్సులు,బెల్టులను గురువారం మండల విద్యాధికారి రామవత్ రవి నాయక్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన విద్యార్థులందరికీ ఉపాధ్యాయుని,ఉపాద్యాయుల ఆర్థిక సహాయంతో వస్తువులు అందించడం అభినందనీయమని అన్నారు.సుమారు నలభై వేల రూపాయల విలువ గల వస్తువులను అందజేయడం జరిగిందని,వంద మంది విద్యార్దులు ఈ సౌకర్యాలను ఉపయోగించుకొని మంచిగా చదువుకోవాలని సూచించారు.విద్యార్దులు ప్రతి రోజూ పాఠశాలకు హాజరై ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా విని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు.అనంతరం వాటిని విద్యార్దులకు అందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్, వెంకయ్య, విష్ణు,పద్మ, జానకమ్మ, పద్మావతి, సరోజ, గీతరమణి, వెంకన్న, శ్రీనివాస్, శీనయ్య, వీరారెడ్డి, వెంకట్, సైదానాయక్,ఏడు కొండలు,లక్ష్మీ నరసయ్య కోటేశ్వర రావ్,జ్యోతి,తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## నాణ్యత, నైపుణ్యాలు లేని చదువులేల?

పుస్తకాల బరువులు పెరుగుతున్నాయి. బట్టీచదువులతో జ్ఞానం విద్యార్థుల మస్తకాలను తాకడంలేదు. నేటి విద్యావ్యవస్థలో చోటుచేసుకుంటున్న హంగులు, ఆర్భాటాలు, ప్రచారాలు 'విగ్రహం పుష్టి- నైవేద్యం నష్టి' అనే సామెతను తలపిస్తున్నది. పిల్లల చదువులవలన తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోయశక్యం గాని విధంగా తయారైంది. చిన్న వయసు చదువుల పేరుతో నీరుగారిపోతున్నది. వ్యాపారంగా మారిన చదువుల వలన బాల్యం మొద్దుబారిపోతున్నది. నేటి చదువులు పుస్తకాలు మోయడానికి, బట్టీ పట్టి, ర్యాంకులు సాధించడానికే పరిమితం కావడం వలన ప్రతిభకు నిర్వచనం మారిపోయింది. ప్రపంచం విజ్ఞాన రంగంలో ఎంతో ముందుకు దూసుకుపోతున్నది. ఇతర గ్రహాలపై అన్వేషణ కొనసాగుతున్నది. భారతదేశం కూడా సూర్యచంద్రాదులపై పరిశోధనలు చేస్తున్నది. అంతరిక్షంలోను, అణు, సాంకేతిక రంగాల్లోను దేశం ముందుకు దూసుకు పోతుంటే, ఇంకా మన విద్యా వ్యవస్థలో పరిశోధనాత్మకతకు, సాంకేతికతకు తావివ్వకుండా కంఠస్థంతో విద్యార్థులు కాలం నెట్టుకురావడం దేనికి సంకేతం? కృత్రిమ మేధస్సు ఉగ్రూతలూగిస్తూ ఉరకలేస్తుంటే, సాంఘిక మాధ్యమాలు వీక్షకు లకు ఊపిరి సలపనీయడం లేదు. అంతరిక్షంలో అద్భుతాలు జరుగుతున్నాయి. స్పేస్‌వాక్ చేసి అంతరిక్షయానంలో ఎదురైన ఆటంకాలను అవలీలగా జయించి విజేతగా భూమికి అడుగిడిన సునీతా విలియమ్స్ సాహసాన్ని చూశాం. అంతరిక్షంలోకి అడుగిడిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లాకు శు భాసీస్సులందించాం. విజ్ఞానం ఇంతగా వికసించి, గ్రహాంతర యానానికి దారులు వెదుకుతుంటే, ఇంకా మనం విద్యావ్యవస్థను మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు చేసుకోలేక ఇబ్బందులుపడుతున్నాం. బట్టీ చదువులకు స్వస్తి చెప్పలేకపోతున్నాం.

ఇంకా మార్కులు, ర్యాంకులంటూ మూస పద్ధతిలోనే పయనిస్తున్నాం.బండెడు పుస్తకాలను విద్యార్థులకు అంటగట్టి, ఫీజుల పేరుతో మోయలేని ఆర్థిక భారాన్ని తల్లిదండ్రులనెత్తిన పెట్టడం భావ్యమా? మారుతున్న కాలానికి అనుగుణంగా చదువుల్లో గుణాత్మకమైన మార్పురావాలి. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు నిరంతరం శ్రమించాలి.విద్యాబోధనలో సులభమైన పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. వాటిని అందుకుని నాణ్యతా ప్రమాణాలగల విద్యను భావితరాలకు అందించాలి.విద్యార్థులకు ఉపాధ్యాయులకు మధ్య గల సంబంధం కేవలం తరగతి గదులకే పరిమితమయ్యే గురుశిష్యుల సంబంధం మాత్రమే కారాదు. విజ్ఞానాన్ని ప్రపంచం నలుచెరగులా వ్యాపింప చేసి, అభివృద్ధికి ఆలంబనగా ఉండాలి. ఉపాధ్యాయులు నవప్రపంచ నిర్మాతలు. విద్యార్థులకు మార్గ నిర్దేశకులు. విశ్వానికి వెలుగురేఖలు ఉపాధ్యాయులు. అజ్ఞానమనే అంధకారంనుండి విజ్ఞానమనే వెలుగువైపు పయనింప చేసే శక్తి కేవలం ఉపాధ్యాయులకే సాధ్యం. ప్రపంచ ప్రగతి సాధన ఉత్తమ విద్య ద్వారా మాత్రమే సాధ్యం. ఉత్తమ నాణ్యతా ప్రమాణాలను నెలకొల్పి, విద్యార్థుల్లో నైపుణ్యానికి ఉపాధ్యాయులు, విద్యావం తులు కృషి చేయాలి. కంఠస్థం చేయడం వలన కంఠశోష తప్ప ప్రయోజనం శూన్యం. దురదృష్టవశాత్తూ ఈనాటికీ ప్రపంచంలో చాలా మందికి విద్యావకాశాలు గగనకుసుమంలా మారాయి. కొన్నిదేశాల్లో స్త్రీలకు చదువుకునే స్వేచ్ఛ లేదు. మరికొన్ని దేశాల్లో కుటుంబాల ఆర్థిక స్తోమత సరిగా లేక, చదువుకునే అవకాశాలు మృగ్యమైపోతున్నాయి. బాలకార్మికులుగా, వీధిబాలల్లా మిగిలి పోతున్నారు. ఒకవైపు ఇలాంటి పరిస్థితులు తాండవిస్తుంటే మరొకవైపు నాణ్యత లేని విద్యవలన ఉద్యోగావకాశాలు సన్నగిల్లుతున్నాయి. నైపుణ్యం లోపించిన చదువులవలన ప్రపంచ ప్రగతి సాధ్యం కాదు. ఉత్తమ ప్రమాణాలు నెలకొల్పడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకంఉపాధ్యాయులు అంకితభావంతో కృషిచేసి, విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలి. విద్య ప్రాధాన్యతను పెంచే విధంగా సంస్కరణలు రావాలి.

నిజమైన విద్యకోసం పాటుపడాలి. సాంకేతిక రంగాన్ని చెడిపోవడానికే వినియోగించుకునే ధోరణిలో మార్పురావాలి. వాస్తవ ప్రపంచానికి దూరంగా, రంగుల లోకంలో విహరిస్తూ పెనుభారంగా తయారైన యువత చాలా ప్రమాదకరం. ఊహల్లో తేలియాడే ప్రపంచానికై ఉగ్రూతలూగుతున్న యువతను సంస్కరించాలి. తల్లిదండ్రుల దృక్పథంలో కూడా మార్పు రావాలి. తల్లిదండ్రులు ఒక స్థాయి వరకు తమ పిల్లలను తమ వద్దే పెరిగేటట్టు చూడాలి. బాహ్య ప్రపంచంలోని అనైతిక ధోరణులవలన కలిగే పర్యవసానాల గురించి తెలియచెప్పాలి. ఉపాధ్యాయులు కూడా తమ వృత్తి పట్ల అంకితభావం ప్రదర్శించాలి. భావితరాలను మేధాశక్తి సుసంపన్నులు తయారు చేయడంలో వారిపట్ల గురుతరమైన బాధ్యత ఉంది. ఉపాధ్యాయుల ఆలోచనల్లోనే నిజమైన దేశనిర్మాణం ఆధారపడి ఉంది. విద్య అనేది అత్యంత శక్తివంతమైన ఆయుధం. విద్య ద్వారా సాధించలేనిదంటూ ఏదీ లేదు. అలాంటి నాణ్యమైన విద్య దేశంలో ప్రతీ ఒక్కరికీ అందాలి. సక్రమమైన విద్యవలన విద్యావంతులు విభిన్నరంగాల్లో తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించి దేశాభివృద్ధిని శిఖరాగ్ర భాగంలో నిలబెట్టగలరు. ప్రపంచగతిని మార్చగలరు. మనిషి మానసిక ఎదుగుదలకు, వ్యక్తిత్వ వికాసానికి విద్య అవసరం. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రావాలి. విద్యార్థులను అన్నిరంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దాలి. అప్పుడే మనం ఆశించిన నిజమైన దేశాభివృద్ధి, ప్రపంచాభివృద్ధి సాధ్యపడుతుంది. విద్యార్థులంతా చక్కని విద్యాసాధనతో విలువలతో కూడిన నవప్రపంచాన్ని సృష్టించాలి. వర్తమాన సమాజం తప్పుటడుగులేస్తున్నది. తప్పటడుగుల దశలో పిల్లలను సరిదిద్దకపోవడమే ఇందుకు కారణం. విద్యార్థులు ఉత్తమ పౌరులుగా రాణించాలంటే వారిలో విలువలను పెంపొందించాలి. 'సంపాదన కోసమే చదువు' అనే భ్రమను తొలగించాలి. ఆహ్లాదకరమైన కుటుంబ వాతావరణంలో పిల్లలు పెరగాలి. కుటుంబ వాతావరణం సరిగా లేకపోతే బాలల భవితవ్యం అగమ్యగోచరమవుతుందన్న సత్యం గ్రహించాలి.

# పెట్టుబడులకు రక్షణ..పరిశ్రమలకు సహకారం

విధానాలు అమలులో ఉన్నాయని, వాటిని మరింత మెరుగైన విధానంలో తమ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్‌ను ఒక వ్యాపార నగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం. మహేశ్వరం ప్రాంతంలో నాలుగో నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచానికి అందించబోతున్నాం. 30 వేల ఎకరాల్లో ప్రపంచంలోనే అధునాతన నగరాన్ని నిర్మించబోతున్నామన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడే నైపుణ్యం ఇక్కడి యువతలో ఉంది. హైదరాబాద్ ప్రపంచంతో పోటీ పడగలదు. అందుకే ముంబాయ్, బెంగుళూరు చెన్నై వంటి నగరాలతో కాకుండా ప్రపంచ అగ్రశ్రేణి నగరాలతో పోటీ పడాలని లక్ష్యంగా నిర్దేశించామని వెల్లడించారు. రాబోవు వందేళ్ల వరకు రాష్ట్రానికి ఏమవసరమో భవిష్యత్ ప్రణాళికలతో రూపొందిస్తున్న తెంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను వచ్చే డిసెంబర్ 9 న ఆవిష్కరిస్తామన్నారు. అధునాతన భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలపై సింగపూర్, ఇతర దేశాల కన్సల్టెంట్లు నిరంతరం పని చేస్తున్నారు. ఐటీ, ఫార్మా రంగాల్లో తెలంగాణ దేశంలోనే లెజెండ్‌గా నిలిచింది. దేశంలో 35 శాతం బల్క్ డ్రగ్ హైదరాబాద్ నుంచే ఉత్పత్తి అవుతోంది. ఇలాంటి ప్రాంతం నుంచి మలబార్ బంగారం యూనిట్ ప్రారంభించడంతో ఇక బంగారంలోనూ తెలంగాణ ప్రసిద్ధి చెందుతుందని తెలిపారు.



బంగారం వ్యాపారం మంచి పేరున్న మలబార్ గోల్డ్ తన యూనిట్‌ను తెలంగాణలో ప్రారంభించడం సంతోషకర పరిణామమని సరైన ప్రాంతంలో, సరైన రాష్ట్రంలో మలబార్ గోల్డ్ తన యూనిట్‌ను ప్రారంభించింది అన్నారు. ఈ యూనిట్ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహమ్మద్, వైస్ చైర్మన్ అబ్దుల్ సలాంతో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏ తప్పు చేయలే..!

- నా శాఖలకు న్యాయం చేస్తున్నాను : మంత్రి సురేఖ
- బీసీల కోసం పోరాడుతా : మాజీ ఎమ్మెల్సీ మురళీ
- సుష్మితకి రాజకీయ నిర్ణయాలు తీసుకునే హక్కు ఉంది : కొండా దంపతులు

**వేద న్యూస్, హైదరాబాద్ :**

ఇప్పటివరకు తాను ఎలాంటి తప్పులు చేయలేదని తనకిచ్చిన శాఖలకు న్యాయం చేస్తున్నానని మంత్రి కొండా సురేఖ అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, తన సతీమణి, మంత్రి కొండా సురేఖతో కలిసి హైదరాబాదులోని ఎమ్మెల్యే క్వార్టర్స్లో రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ తో గురువారం భేటీ అయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరుగుతున్న అంశాలపై ఆమెకు నివేదిక ఇచ్చారు. అనంతరం మీడియాతో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ నిబంధనల ప్రకారమే తను పని చేస్తున్నానన్నారు. తన శాఖలో ఉన్న ఫైల్స్ అన్ని పరిశీలించుకోవచ్చని చెప్పారు. మంత్రిగా తాను ఇప్పటివరకు ఎలాంటి తప్పులు చేయలేదని తెలిపారు. మంత్రి పదవిపై ఎవరు మాట్లాడినా స్పందించనన్నారు. సుష్మితలో పారేది కొండా మురళి, కొండా సురేఖ రక్తమన్నారు. తన కుమార్తెకు వారి ఆలోచనలు వంశ పారపర్యంగా రావడంలో తప్పు లేదని వివరించారు. సుష్మిత రాజకీయ ఆలోచనలను తప్పు పట్టలేమని చెప్పారు. కొండా మురళీ మాట్లాడుతూ తనకు ప్రజాబలం ఉందని, పనిచేసే వారిపైనే అబాండాలు వేస్తారని అసహనం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ గెలిచేలా కృషి చేస్తానని చెప్పారు. పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించే బాధ్యత తాను తీసుకుంటానని వివరించారు. కాంగ్రెస్ పార్టీని బతికించడమే తన ఉద్దేశమని స్పష్టం చేశారు.



భారత్ జోడో యాత్రతో దేశంలోని ప్రతి పేదవాడి సమస్యలు తెలుసుకుంటూ, ముందుకు కదిలిన రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమని తన లక్ష్యమని రేవంత్ రెడ్డిని ఇంకో పదేండ్లు ముఖ్యమంత్రిగా చూడాలని అనుకుంటున్నట్టు చెప్పారు. తాను బీసీనని.. బీసీల కోసం కడదాకా కొట్లాడుతా అంటూ ఆయన స్పష్టం చేశారు. తన కుమార్తె ఎక్కడి నుంచి పోటీ చేయడం లేదన్నారు. ఒక్కొక్కరి ఆలోచన ఒక్కోలా ఉంటుందన్నారు. తమ కుమార్తె అనుకునేది తనకు తెలియదని తొందర పడి ఏం అన్నాదో తనకు తెలియదని తెలిపారు

# భారత్‌లో ఐఫోన్ తయారీకి చైనా బ్రేక్?

- భారత్‌లోని ఐఫోన్ ప్లాంట్ల నుంచి చైనా ఉద్యోగులను వెనక్కి పంపుతున్న ఫాక్స్‌కాన్
- ఇప్పటికే 300 మందికి పైగా చైనా సిబ్బంది స్వదేశానికి వెళ్లినట్లు సమాచారం
- తయారీ రంగంలో టెక్నాలజీ, నిపుణుల తరలింపును అడ్డుకునే చైనా వ్యూహంలో భాగమేనని కథనాలు
- స్థానిక కార్మికుల శిక్షణ, ఉత్పత్తి సామర్థ్యంపై ప్రభావం చూపే అవకాశం

**వేద న్యూస్, డెస్క్:**

భారత్‌లో తయారీ రంగాన్ని భారీగా విస్తరించాలని ప్రణాళికలు రచిస్తున్న టెక్ దిగ్గజం యాపిల్‌కు అనూహ్య పరిణామం ఎదురైంది. యాపిల్ కోసం ఐఫోన్లను తయారుచేసే అతిపెద్ద భాగస్వామ్య సంస్థ ఫాక్స్‌కాన్, భారత్‌లోని తన ప్లాంట్ల నుంచి చైనాకు చెందిన ఉద్యోగులను వెనక్కి పంపించే ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ పరిణామం భారత్‌లో ఐఫోన్ తయారీ భవిష్యత్తుపై ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. బ్లూమ్‌బర్గ్ నివేదిక ప్రకారం, దక్షిణ భారతదేశంలోని ఫాక్స్‌కాన్ ఐఫోన్ ప్లాంట్లలో పనిచేస్తున్న చైనా ఉద్యోగులను తిరిగి తమ దేశానికి వెళ్ళిపోవాలని యాజమాన్యం ఆదేశించింది. గత రెండు నెలలుగా ఈ ప్రక్రియ కొనసాగుతోందని, ఇప్పటికే దాదాపు 300 మంది చైనా నిపుణులు భారత్‌ను విడిచి వెళ్లారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం కేవలం సహాయక సిబ్బందిలో కొందరు మాత్రమే ఇక్కడ మిగిలి ఉన్నట్లు సమాచారం. అయితే, ఈ నిర్ణయం వెనుక కచ్చితమైన కారణం ఏమిటనేది ఫాక్స్‌కాన్ అధికారికంగా వెల్లడించలేదు. కానీ, తమ దేశంలోని కంపెనీలు టెక్నాలజీ, నైపుణ్యం కలిగిన కార్మికులను భారత్, వియత్నాం వంటి దేశాలకు తరలించడాన్ని నిరుత్సాహపరిచేందుకు చైనా ప్రభుత్వం ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. అమెరికా-చైనా మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో తయారీ కంపెనీలు చైనా నుంచి బయటకు తరలిపోకుండా అడ్డుకునే వ్యూహంలో ఇది భాగం కావచ్చని కథనాలు వస్తున్నాయి. ప్రస్తుతం యాపిల్ ఏటా తయారుచేసే ఐఫోన్లలో సుమారు 15 శాతం (40 మిలియన్ యూనిట్లు) భారత్‌లో ఉత్పత్తి అవుతున్నాయి. త్వరలో విడుదల కానున్న ఐఫోన్ 17 ఉత్పత్తిని భారత్‌లో భారీగా పెంచాలని యాపిల్ భావిస్తోంది. ఇలాంటి కీలక సమయంలో చైనా నిపుణులు వెనుదిరగడం ఉత్పత్తి సామర్థ్యంపై ప్రభావం చూపవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. చైనా సిబ్బందిని వెనక్కి పిలవడం వల్ల స్థానిక కార్మికులకు శిక్షణ ఇవ్వడం, తయారీ



సాంకేతిక పరిజ్ఞానాన్ని చైనా నుంచి బదిలీ చేసే ప్రక్రియ నెమ్మదించవచ్చని నిపుణులు భావిస్తున్నారు. దీనివల్ల ఉత్పత్తి వ్యయం పెరిగే ప్రమాదం ఉందని వారు అంచనా వేస్తున్నారు. "ఈ నిర్ణయం వల్ల భారత్‌లో ఉత్పత్తి నాణ్యతపై ప్రభావం పడకపోవచ్చు, కానీ అసెంబ్లీ లైన్‌లో సామర్థ్యం కచ్చితంగా తగ్గుతుంది" అని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఒకరు చెప్పినట్లు నివేదిక పేర్కొంది

# నో ప్లాస్టిక్ డే అవగాహన ర్యాలీ




**వేద న్యూస్, చొప్పదండి :**

అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం పురస్కరించుకుని కరీంనగర్లోని అశోక్ నగర్ ఎస్ ఆర్ డీజీ స్కూల్ విద్యార్థులు నాకా చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ రహిత వాడకం పై అవగాహన కార్యక్రమము చేపట్టారు. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజలకు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్ ఆర్ స్కూల్స్ జోనల్ ఇంచార్జీ శశధర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వలన మనం మన ప్రకృతిని నష్టపోతున్నామని, గాలి, నేల, నీరు కలుషితమవుతుందని అన్నారు. ప్రిన్సిపల్ మానస మాట్లాడుతూ ప్లాస్టిక్ మన అవసరాలకు వాడకుండా ఉంటే మన ప్రకృతిని ఇంకా అందంగా పెంపొందించుకుని భావితరలకు ఏ విధమైన రోగాలు వాకుండా మంచి గాలి, నీరు ను అందించగల మని కాబట్టి ప్లాస్టిక్ వాడకాన్ని ఈ రోజు నుండి తగ్గించాలని అన్నారు. ఈ కార్యక్రమములో పాఠశాల ఉపాధ్యాయులు లావణ్య, ప్రశాంత్, నిర్మల, శ్రీనివాస్ మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నిర్వాసితుల పట్టా ప్యాకేజీ కొరకు

# దరఖాస్తుల స్వీకరణ

**వేద న్యూస్, బోయినిపల్లి :**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలో 2015 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి పట్టా ప్యాకేజీ కోసం దరఖాస్తులను బోయినిపల్లి తహసీల్దార్ నారాయణ రెడ్డి, ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరణ గురువారం నిర్వహించడం జరిగింది. దరఖాస్తు సేకరణలొ బాగంగా ఆయన మాట్లాడుతూ మిడ్ మానేర్ లో చాలామందికి పట్టా ప్యాకేజీ రాలేదు అనే ఉద్దేశంతో ఈ దరఖాస్తులను తీసుకోవడం జరుగుతుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి యువకులకు పట్ట ప్యాకేజీ ఇప్పించలనే ఉద్దేశంతో అలాగే నిర్వాసితుల సమస్యలు తీర్చాలానే ఉద్దేశంతో చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,కలెక్టర్ తో మాట్లాడి,ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రతి ఒక్కరికి న్యాయం జరగాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించారన్నారు. పట్టా వచ్చి ప్యాకేజీ రాకపోయినా ప్యాకేజీ వచ్చిన పట్టా రాకపోయినా గెజిట్ లో ఉన్న ప్రతి ఒక్కరికి పట్టా ప్యాకేజీ కోసం కోదురుపాక గ్రామపంచాయతీ లో దరఖాస్తులను స్వీకరించారని తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ సభను విజయవంతం చేయాలి

**వేద న్యూస్, కాశీబుగ్గ :**



హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరుగనున్న ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వర్ధన్నపేట నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు భారీగా పాల్గొనాలని మహేష్ అన్నారు. ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జై బాపు జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామ మండల అధ్యక్షుల ఆత్మీయ సమ్మేళన బహిరంగ సభలో పాల్గొనాలన్నారు. దేశంలోనే తొలిసారిగా గ్రామస్థాయి కాంగ్రెస్ అధ్యక్షులతో ఏఐసిసి అధ్యక్షుడు నేరుగా సమావేశం కానుండడం ఎంతో విశిష్టమైన ఘటనగా అని అన్నారు. సభకు హాజరయ్యే గ్రామ మండల నాయకులు సమన్వయంతో ముందుగానే రావాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు.

# టీడబ్ల్యూజేఎఫ్ నేతల పరామర్శ



**వేద న్యూస్, హనుమకొండ :**

ఇటివల ప్రమాదవశాత్తు గాయపడిన హనుమకొండ విలేకరి మాడ నర్సయ్యను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్షులు టి.వి రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి అంతడుపుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు దామెర రాజేందర్ గురువారం ఆయన గృహంలో పరామర్శించారు. ప్రమాదవశాత్తు గాయపడి గార్డియన్ హాస్పిటల్ లో చికిత్స పొందినట్లు తెలిపారు. వారి చేయి విరగడంతో డాక్టర్లు ఆపరేషన్ చేశారని, ఆయన ప్రస్తుతం హనుమకొండ స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలిపారు. మాడ నర్సయ్య త్వరగా కోలుకోవాలని టిడబ్ల్యూజేఎఫ్ ఆశాభావం వ్యక్తం చేస్తుందని పేర్కొన్నారు.

# జపాన్‌లో వరుస భూకంపాలు

**వేద న్యూస్, డెస్క్:**

జపాన్‌ను వరుస భూకంపాలు వణికిస్తున్నాయి. టొకార దీవుల సమూహంలో గత రెండు వారాలుగా భూమి నిరంతరం కంపిస్తూనే ఉంది. జూన్ 21 నుంచి ఇప్పటివరకు అక్కడ ఏకంగా 900 సార్లు భూప్రకంపనలు నమోదవడంతో తీవ్ర ఆందోళన కలుగుతోంది. సగటున గంటకు మూడుసార్లకు పైగా భూమి కంపిస్తుండటంతో స్థానికులు భయంతో వణికిపోతున్నారు. బుధవారం కూడా ఇదే ప్రాంతంలో 5.5 తీవ్రతతో మరో భారీ భూకంపం సంభవించింది. దీంతో అధికారులు వెంటనే సునామీ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, కాసేపటికే వాటిని ఉపసంహరించుకున్నారు. ఈ వరుస పరిణామాలతో అప్రమత్తమైన యంత్రాంగం అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జపాన్ వాతావరణ సంస్థ అధికారి అయాటకా ఎబిటా ఈ వివరాలను ధృవీకరించారు. జూన్ 23న ఒక్కరోజే అత్యధికంగా 183 సార్లు ప్రకంపనలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. "నిరంతరం భూమి కదులుతున్నట్లే అనిపిస్తోంది, ఏం జరుగుతుందోనని భయంగా ఉంది" అని ఒక స్థానికుడు ఆవేదన వ్యక్తం చేశాడు. టొకార దీవుల్లో జనాభా తక్కువగా ఉండటం ఒక్కటే ఊరటనిచ్చే అంశం. ఇక్కడ మొత్తం 12 దీవులు ఉండగా, ఏడింటిలో మాత్రమే సుమారు 700 మంది ప్రజలు నివసిస్తున్నారు. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్'పై ఉండటంతో జపాన్‌లో భూకంపాలు సర్వసాధారణం. ఇక్కడ ఏటా దాదాపు 1,500 ప్రకంపనలు నమోదవుతాయి.

# ఖర్గే సభను సక్సెస్ చేద్దాం

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్న గ్రామ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనానికి జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హాజరయ్యే బహిరంగ సభను విజయవంతం చేయాలని టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గజ్జ చందు పిలుపునిచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ మురళీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్, పట్టణ అధ్యక్షులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

# ఆర్ఆర్‌బీ ఎన్‌టీపీసీ రాత పరీక్షల షెడ్యూల్

**వేద న్యూస్, డెస్క్:**

గత కొద్ది నెలలుగా ఇండియన్ రైల్వే వరుస ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా గత ఏడాది రైల్వే ఎన్‌టీపీసీ నాన్-టెక్నికల్ పాపులర్ కేటగిరీ అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ కూడా గతేడాదే ముగిసింది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 11,558 నాన్-టెక్నికల్ కేటగిరీ పోస్టులను భర్తీ చేయనుంది. ఇందులో గ్రాడ్యుయేట్ స్థాయికి 8,113 ఉద్యోగాలు, అండర్ గ్రాడ్యుయేట్ స్థాయి 3,445 ఉద్యోగాలు ఉన్నాయి. ఇందులో గ్రాడ్యుయేట్ స్థాయి పోస్టులకు స్టేజ్ 1 ఆన్‌లైన్ రాత పరీక్షలు జూన్ నెలలో ముగిశాయి. ఇక అండర్ గ్రాడ్యుయేట్ పోస్టులకు రాత పరీక్ష తేదీలను రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) తాజాగా విడుదల చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం.. ఆన్‌లైన్ ఆధారిత రాత పరీక్షలు ఆగస్టు 7వ తేదీ నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా పలు పరీక్ష తేదీల్లో జరగనున్నాయి. దాదాపు నెల రోజుల పాటు ఈ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలకు 10 రోజులు ముందుగా సిటీ ఇంటిమేషన్ స్లిప్‌లను బోర్డు విడుదల చేస్తుంది. ఆ తర్వాత పరీక్షలకు 4 రోజులు ముందుగా అడ్మిట్ కార్డులను జారీ చేయనుంది.

# వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

**వేద న్యూస్,నాగార్జునసాగర్/మిర్యాలగూడ ప్రతినిధి :**



తిరుమలగిరి సాగర్ నియోజకవర్గం మండల హెడ్ క్వార్టర్స్ లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఏకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు బాటలో.. తప్పటడుగులు వద్దు అనే వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గెస్ట్ స్పీకర్ విద్యాదాన్ ఫౌండేషన్ ప్రెసిడెంట్, రియల్ పేజ్ కంపెనీ డైరెక్టర్ ఈదర ప్రసన్న విద్యార్థులుని ఉద్దేశించి మాట్లాడుతూ బాలికలే మన దేశపు భవిష్యత్తు అని వారు ఎప్పుడు కూడ తమని తక్కువ అంచనా వేసుకోకూడదని ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చు అని అన్నారు. విద్యార్థులకు గ్రూప్ యాక్టివిటీస్ నిర్వహించి విద్యార్థులలో ఉత్తెజాన్ని నింపారు. ఈ సందర్భంగా ఏకే ఫౌండేషన్ చైర్మన్,హైకోర్టు న్యాయవాది విద్యార్థులకు పోక్సో చట్టం 2012 గురించి అవగాహనా కల్పించారు. అదే విధంగా విద్యార్థులని ఉద్దేశించి మాట్లాడుతూ ఎలాంటి ప్రేరణలు లోను కాకుండా లక్ష్య సాధన దిశగా ప్రతి అడుగు వేయాలని దృఢ సంకల్పం తో అద్భుతాలు సాధించి కన్న తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు పుట్టిన ఊరు కి మంచి పేరు తేవాలని వారి లక్ష్య సాధనలో ఏకే ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలియజేశారు.విద్యార్థులకి విజేతల జీవిత విశేషాలు తెలియజేసి వారి లో నూతన ఉత్తెజాని నింపారు, విద్యార్థులకు బహుతులు ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ ఓ కవిత,ఉపాధ్యాయులు హిమ బిందు, కృష్ణవేణి, పుష్పలత,విమల, బ్యూలా, శిరీష,విజయ్,ఏకే ఫౌండేషన్ సభ్యులు మన్నెం కోటి, శేఖర్ గౌడ్,మోకారాల అనిల్, బొమ్మిశెట్టి రామలింగయ్య, గంగుల మహేష్,కరాకుట్ల వరుణ్, బత్తుల సుమంత్,రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎగిరేందుకు మొరాయిస్తున్న ఖరీదైన యుద్ధ విమానం

**వేద న్యూస్, డెస్క్:**

ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన, ఖరీదైన యుద్ధ విమానం... బ్రిటన్ రాయల్ నేవీ అమ్ములపొదిలో పదునైన అస్త్రం... అలాంటి ఎఫ్-35బి లైట్నింగ్ ఫైటర్ జెట్ ఒకటి కేరళలో మొరాయించింది. చిన్నపాటి సాంకేతిక లోపంతో మొదలైన సమస్య, నెల రోజులు గడిచినా పరిష్కారం కాకపోవడంతో, చివరికి విమానాన్ని విడిభాగాలుగా విడదీసి స్వదేశానికి తరలించడమే ఏకైక మార్గమని బ్రిటిష్ అధికారులు నిర్ణయించారు. తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో నెల రోజులుగా నిలిచిపోయిన ఈ ఐదో తరం ఫైటర్ జెట్ ఉదంతం, ఇప్పుడు అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గత నెలలో బ్రిటిష్ నౌకాదళానికి చెందిన విమానవాహక నౌక 'హెచ్ఎంఎస్ క్వీన్ ఎలిజబెత్' హిందూ మహాసముద్రంలో విన్యాసాలు నిర్వహించింది. ఆ సమయంలో దానిపై నుంచి గాల్లోకి లేచిన ఒక ఎఫ్-35బి విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో పైలట్ అప్రమత్తమై, అత్యవసరంగా సమీపంలోని తిరువనంతపురం ఎయిర్‌పోర్ట్‌లో విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. తొలుత ఇది చిన్న సమస్యేనని భావించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073